# దొంగల్ని పట్టుకోవడం

యం బి యస్ ప్రసాద్



దొంగతనం చెయ్యడం అరవై నాలుగు కళ్ళల్లో ఒక కళగా మన వాళ్ళు గుర్తించారు కానీ దొంగల్నిపట్టుకోవడం మాత్రం గుర్తించలేదు. కానీ దొంగల్ని పట్టుకోవడం కూడా ఓ మంచి కళ అని నా అభిప్రాయం.

కళ అని ఎందుకంటున్నానంటే, మీరు రోడ్డుమీద నడుస్తూ వస్తూంటే, ఎదురుగా ఓ వ్యక్తి పరిగెత్తుకొస్తున్నాడనుకోండి. అతని వెనక్కాల "దొంగ, దొంగ, పట్టుకోండి " అన్న కేకలూ, వినవస్తూంటాయి. మీరు చేతులు సాచి అతన్ని పట్టుకొందామని అనుకొంటారు. కానీ చేతిలో వున్న పంచదార పొట్లాన్ని ఏం చెయ్యాలో తోచదు. 'పక్కవాణ్ని పిలిచి వాడి చేతికిద్దామా,' లేక 'దొంగాణ్నే పొట్లం పట్టుకోమందామా' అన్న ఆలోచన తెగే లోపుల దొంగాడు మీకు బాగా దగ్గరగా వచ్చేస్తాడు. మీరు కంగారుగా పొట్లం వదిలేసి, ఏదో తెలియని నాట్య భంగిమలో చేతులు పెట్టి గాలిని పట్టుకొనే లోపుల దొంగాడు పారిపోతాడు (వాడు వెళ్తూ వెళ్తూ మిమ్మల్ని తన్నకుండా వెళ్తే అదృష్టవంతులనుకోండి). ఆ తరువాత మీరూ "దొంగ, దొంగ, పట్టుకోండి " అని అరిచేవాళ్ళలో ఒకరవుతారు.



పోనీ అర్ధరాత్రి ఇంట్లో నిద్రపోతుండగా పక్కింట్లోంచి "బాబోయ్' దొంగ, దొంగ " అన్న కేకలు విని ఉలిక్కిపడి లేచారనుకోండి. అడ్డదిడ్డంగా ఉన్న లుంగీని సవరించుకొని "మీకెందుకండీ అనవసరంగా, గమ్మునుండక " అంటూన్న భార్యామణి మాటలు త్రోసిపుచ్చి, రోడ్డు మీద పడి దొంగని పట్టుకోడానికి పరిగెట్టబోయే సరికి లుంగీ కాళ్ళకి అడ్డం పడుతుంది. కంకరరాయి కాలికి ఎదురుదెబ్బ తీస్తుంది. లేచినవేళ బాగుండకపోతే మిమ్మల్నే దొంగ అని మిగతా వాళ్ళు పట్టుకోవచ్చు.

పరుగు బాగా వచ్చినంత మాత్రాన

దొంగాణ్ని పట్టుకోగలమనుకోడం పొర పాటు. ఒలింపిక్ రన్నర్ మిల్కాసింగ్ ('ఆర్ యూ రిలాక్సింగ్?' అని అడిగితే 'నో ఐ యామ్ మిల్కాసింగ్ అన్న జోక్ తెలుసుగా) ఇంట్లో ఓసారిలాగే దొంగాడు పడితే మిల్కాసింగ్ వాణ్ని పట్టుకోడానికి వెంటపడ్డాడట! కొంతసేపు పోయాక జనం అడ్డదారిని పరిగెట్టి మిల్కాసింగ్‌ని ఆపి "దొంగేడీ?" అంటే, మీసం మెలేసి, "వెధవ, నాతో సమానంగా పరిగెట్టగలడా? ఎప్పుడో వెనకపడిపోయాడు" అన్నాట్ట గర్వంగా.

దొంగల్ని పట్టుకోగానే సరిగాదు! వాళ్ళని కొట్టి, వాళ్ళచేత నిజం కక్కించాలి. ఈ కార్యక్రమంలో మాత్రం చాలా మంది సహకరిస్తారు. "గుంపులో గోవిందా" అన్నట్లు వెనకనుంచైనా ఓ దెబ్బ వెయ్యొచ్చుకదాని. మా ఇంటి దగ్గర ఓసారిలాగే దొంగాడు దొరికితే మా అన్నయ్య హీరోలా వెళ్ళాడు. దొంగని ఎలక్ట్రిక్ స్తంభానికి చేతులు విరిచి వెనక్కి కట్టేస్తే, అలాకాదని విప్పించి చెట్టుకి కట్టించాడు. (ఎలక్ట్రిక్ పోలయితే సినిమాల్లోలా దాని మీద తాడు గీసి, తెంపేసుకొంటాడట!) చేతులు గట్టిగా కట్టేసారని ధృవపరచుకొన్న తర్వాతనే ఈడ్చిపెట్టి లెంపకాయలు కొట్టేడు చివరగా తన డిటెక్టివ్ సాహిత్యానుభవాన్ని పురస్కరించుకొని సిగరెట్టుతో వాడి బుగ్గ కాల్చి, రహస్యాలు చెప్పమని హింసించేడు.

ఈ విధంగా వాడు డిటెక్టివ్ కావాలన్న తన కండూతి తీర్చుకున్న, తర్వాత అందరూ వాణ్ని భయపెట్టేరు. ఆ దొంగా దెప్పుడో దారికాసి, తన్ని తన కక్ష తీర్చుకొంటాడని. దాంతో ఆ రెన్నెల్ల పాటు సాయింత్రం చీకటి పడితే ఇంటినుండి బయటకు వెళ్ళేవాడు కాడు. ఇప్పుడు అంటుంటాడు. 'పడుకొనేటప్పుడు రెండు తలుపులు తెరిచి వుంచాలని, ఒక దాంట్లోంచి దొంగ ప్రవేశిస్తే, రెండో దాంట్లోంచి మనం పారిపోవచ్చుట! (ఒకే తలుపైతే చీకట్లో కనబడక, ఒకళ్ళనొకళ్ళు గుద్దుకోడానికి అవకాశం వుంది.)

దొంగలు పట్టుబడ్డప్పుడు సిగ్గుపడినట్లు కనిపించరు. సినిమాల్లో నాగభూషణం లాటి వాళ్ళు క్లైమాక్సులో 'మేమేకాదు, మాలాటివాళ్ళు ఈ లోకంలో చాలామంది వున్నారు' అని క్లోజప్పులో డైలాగు చెప్పేసి, వేన్ ఎక్కేస్తారు. (ఆ వేన్ సీను నాకు భలే ఇష్టం! లాంగ్‌షాట్లో ఆ వాన్ ఊచల్లోంచి హీరోయిన్ ఏడుస్తూ కనిపిస్తూంటే 'ఆహా! పట్టుబడ్డంతో ఎంత మజా ఉంది' అనిపిస్తుంది.) ఒక్కొక్కప్పుడు దొంగకంటే పోగొట్టుకొన్నవాడే



ఎక్కువ సిగ్గుపడాల్సొస్తుంది. ఒకసారి నేను డబల్‌డెకర్ ఎక్కుతూంటే ఎవడో నా పర్సు కొట్టేసేడు. నేను ఫరవాలేదని ఎంత చెప్తున్నా వినకుండా, జనం పరిగెట్టి వాణ్ని పట్టుకొని పర్సు లాక్కున్నారు. తెరచి చూస్తే నాలుగు పిచ్చి కాయితాలు, ముప్ఫైఅయిదుపైసల చిల్లరా ఉన్నాయి. జనం అంతా 'అబ్బో చాలా ఖజానాయే వుందే! అంటూ వేళాకోళం చేసేరు. నాకు సిగ్గుతో చచ్చినంత పనయి, జనంలో కలిసిపోయేను.

దొంగల్ని పట్టుకొన్నాక పోలీసుల కప్పగించినవాడు. జన్మలో మళ్ళీ దొంగల్ని పట్టుకొనేందుకు సాహసించడు. పోలీసులు వాణ్ని కోర్టులవెంట తిప్పించి నేరకపోయి పట్టుకున్నాన్రా భగవంతుడా! అనిపించేస్తారు

దొంగల్ని పట్టుకోడానికి పోలీసులు, పోలీసు కుక్కలూ, డిటెక్టివ్‌లూ చాలా మంది ఉన్నారు. కానీ దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. కారణం దొంగల్నిపట్టుకోడం ఈ రోజుల్లో గిట్టుబాటుగా లేదు. వెనుకటి రోజుల్లో అయితే ('అనగనగా ఓ రాజు ' కథల ప్రకారం) అర్ధరాజ్యం రాజకుమార్తె దొరికేవి. ఇప్పుడో— ప్రాణంకు తెగించి దొంగను పట్టుకున్న పోలీసుకు పదిహేను రూపాయల చెక్కు ఐజీగారు 'స్వయంగా' అందజేస్తున్నారు.*


గ్రామ్స్: "KILPEST" ఫోన్స్: ఆఫీస్ · 74269
ఫ్యాక్టరీ . 86-368

# అశోక్ ఫర్టిలైజర్స్

అన్ని రకముల పెస్టిసైడ్స్ మరియు ఇన్‌సెక్టిసైడ్స్ ఉత్పత్తిదారులు
బి. హెచ్. సి. డి. డి. టి, మలథియాన్ ఎండ్రిన్ మొ॥ నవి.

| ఆఫీసు | ఫ్యాక్టరీ |
| --- | --- |
| లక్ష్మీభవన్ | డి-11 యూనిట్ |
| శివాలయం వీధి | ఇండస్ట్రియల్ ఎస్టేట్ |
| సత్యనారాయణ పురం | పటమట |
| **విజయవాడ-11** | **విజయవాడ-7** |